

స్టేషన్ ఘన్‌పూర్ : శివునిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జఫర్‌గఢ్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# ఊరూరా.. ఉత్సాహంగా..

- సద్దుల బతుకమ్మ వేడుకలు
- ఆడిపాడిన ఆడబిడ్డలు
- వాగులు, చెరువులు వద్ద సందడి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 22 : పూవులను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే , తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ వేడుకలను మహిళలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. చెరువుల వద్ద జీపీల ఆధ్వర్యంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. తీరొక్క పూవులతో మహిళలు బతుకమ్మను అందంగా పేర్చి తీసుకొచ్చి ఆడిపాడారు. యువతులు బతుకమ్మల వద్ద డీజే పాటలు పెట్టుకుని ఉషారుగా కోలాటం ఆడారు.

### పాలకుర్తిలో..

పాలకుర్తి : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ సంబురాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తంగేడు, గునుగు పూలతో పాటు రంగులు రంగులతో అలంకరించిన బతుకమ్మ గంగమ్మ ఒడికి చేరింది. ఆడ పడుచుల ఆనందోత్సహాల నడుమ మండల వ్యాప్తంగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి ఊరచెరువు వద్ద నిర్వహించిన సంబురాలు అంబురాన్నంటాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలతో వచ్చి పాటలు పాడుతూ కోలాటంతో నృత్యం చేశారు. మహిళల వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చెరువు గట్లు కోలాహలంగా మారాయి. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి లక్ష్మి, గౌరీదేవిలుగా భావించి పూజలు నిర్వహించారు. వయోభేదాన్ని మరచి చిన్నా, పెద్దా తేడా లేకుండా మహిళలంతా ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మలు చేతబట్టి కోలాటం, డీజే పాటలతో బతుకమ్మ తల్లిని కొలుస్తూ ఆడి పాడారు. అన్ని గ్రామాల్లోని చెరువుల వద్ద బతుకమ్మ పండుగలను మహిళలు సంతోషంగా జరుపుకున్నారు. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు.

### లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : గ్రామగ్రామాన బతకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆయా చెరువుల, కుంటల వద్ద సర్పంచ్‌లు బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎస్సై బోగం ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

### రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తంగెడుపువ్వు, గునుగు, వివిధ రకాల పువ్వులతో తయారు చేసిన బతుకమ్మలను మహిళలు తీసుకెళ్లి ప్రధాన కూడళ్ల వద్ద ఒక్క దగ్గర చేర్చి బతుకమ్మ పాటలు పాడారు. సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్ ఆధ్వర్యంలో పేర్చిన పెద్ద బతుకమ్మ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

### చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేశారు. మహిళాలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. జానపద పాటలు పడుతూ, నృత్యం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### బతుకమ్మ వేడుకల్లో ఆర్బీఎస్ అధ్యక్షుడు రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని చెరువుకట్టపై బతుకమ్మ వేడుకలకు ఆర్బీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాజయ్య హాజరయ్యారు. అక్కడున్న పెద్ద బతుకమ్మను ఎత్తుకున్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో నేడు డివిజన్ కేంద్రంలోని రిజర్వాయర్, గ్రామాల్లోని చెరువులు నేడు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. మహిళలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.

### ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు

స్టేషన్ ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని చెరువు కట్ట వద్దకు మహిళలు తీసుకువచ్చిన 40 ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి స్టేషన్ ఘన్‌పూర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో షీల్డ్‌లు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు అక్కనపల్లి అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలు అద్దం పట్టే పండుగ బతుకమ్మ అని అన్నారు. పెద్దగా పేర్చిన, ఆకర్షణీయంగా ఉన్న బతుకమ్మలకు ఎంపిక చేసి షీల్డులు అందించామన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కన్వీనర్ పెసరు సారయ్య, కల్చరల్ కన్వీనర్ ఉబ్బని మల్లేశం, గౌరవ సలహాదారుడు యంజాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు గోలి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి అంబటి కిషన్ రాజు, కార్యదర్శి, ఎంపిటీసీ మాజీ గట్టు రమేశ్, కోశాధికారి గన్ను కార్తిక్, దారం రాజు, యాకూబ్ పాషా, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాలకుర్తి : పెద్ద బతుకమ్మతో తరలి వస్తున్న మహిళలు



జఫర్‌గఢ్ : సాగరంలో బతుకమ్మలతో మహిళలు



స్టేషన్ ఘన్‌పూర్ : బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూరు : మల్కాపూర్‌లో బతుకమ్మలతో మహిళలు



పాలకుర్తి : హోమం చేస్తున్న భక్తులు

## దుర్గాదేవిగా అమ్మవారు

పాలకుర్తి, అక్టోబర్ 22 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దేవీన వరాత్రోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉత్సవాలు ఘనంగా జరిపారు. ఆదివారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు అభిషేకం, అర్చనలు, కుంకుమార్చన, చండీ హోమం చేశారు.

### కొడకండ్లలో..

కొడకండ్ల : మండల కేంద్రంలోని యోగ లింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ ఎన్ సుధాకర్ రావు దంపతులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసునూరి మధుసూదన్, పాలకుర్తి దేవస్థాన ధర్మకర్త కోటగిరి కుమార్, ఉప సర్పంచ్ బోయిని రమేశ్ పాల్గొన్నారు.



కొడకండ్ల : ఆలయంలో పూజలు చేస్తున్న ఎన్ సుధాకర్‌రావు